మానవసేవా గ్రంథమాల. 1

కబీరు

ఇది

అత్తిలి సూర్యనారాయణచే

రచింపఁబడి

మానవసేవా పత్రికయందు

ప్రకటింపఁబడినది.

రాజమహేంద్రవరము.

శ్రీ మనోరమా, ప్రెస్ ఇండస్ట్రియల్ విసస్ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడినది.

1911.

వెల. 2 అణాలు.

కబీరు.

భక్తమాల

కబీరు.

ఆ సన్మార్గమునందు సంచరించుచు నజ్ఞానాంధకారమునఁ బడి పొరలుచున్న జనసామాన్యము నుద్ధరించుటకై తమజీవితములను ధారవోయు నుత్తరహిందూస్థానమున నుద్భవించిన పరమభాగవతోత్తములయిన మతసంస్కర్తలలో కబీరుదాసుని మించినవారు వేఱొకరు లేరని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును. కబీరుకాలమునాఁటి హిందూదేశస్థితినిబట్టి చూడఁగా, పరస్పరవైషమ్యములతో వేఁగుచున్న హిందూమహమ్మదీయులకు మతిమూలమున నైకమత్యమును గూర్చుటకై ధీరవృత్తితోఁ బ్రయత్నింపఁగల మహానీయుఁడొకఁడు పుట్టుట యావశ్యకమైయుండెననియు, మనుష్యకోటియొక్క యభివృద్ధికయి నిరంతరము పరిహించుచుండిన యీశ్వరకారుణ్యము విశేషముగా నవతరింపవలసిన యవసరమప్పుడు వచ్చియుండెననియు, స్పష్టముగా దెలియఁగలదు. పఠానుపరిపాలకులు చండశాసనులై మతసహన మన్నమాటలేక విమతస్థుల నెందఱిని జంపించిన నంతకీర్తి సంపాదించుచుంటిమని గర్వించుచుండిరి. పరిపాలనము కట్టుదిట్టముగా లేకయుండుటచేతను బలవంతుఁడే సర్వాధికారము కలవాఁడైయుండుటచేతను, అందుచే ఢిల్లీపాలకులలో నెప్పటికప్పుడు మార్పులు కలుగుచుండుటచేతను, పట్టణములందును పల్లెలందును గల తురకప్రజలు తామే యధికారులుగా చరించుచు తోడి హిందువులను ద్వేషించి పలుతెఱంగుల హింసించుచుండుటయు, హిందువులు తమ్ము విగ్రహారాధనమును మానవలయునని తుఱకలు కఠినపద్ధతులను బూని గావించినకొలఁదిని పట్టుదల వహించి మ్లేచ్ఛులపై విద్వేషమును పెంపుకొని మఱింతయెక్కువగా తమపద్ధతుల కంటియుండుటయు, సంభవించుచుండెను. ఇట్లు దేశము పరస్పర కలహములతో నిండియుండఁగా ఈదేశమును స్వాధీనముచేసికొనుటకు సమయమెప్పుడు దొరకునాయని యాఫ్ఘనుదేశమం దున్న మొగలాయినాయకులు తొంగితొంగి చూచుచుండిరి. అట్టికష్టకాలమున కబీరు జన్మించి దేశమునందలి విగ్రహారాధకుల మనస్సులను ఏకేశ్వరుని వైపునకు మరల్చి హిందూమహమ్మదీయుల నైకమత్యమును నెలకొలుపవలయునని ప్రయత్నించెను.

కబీరు జీవచరిత్రమును గురించి పలువురు పలువిధములుగాఁ జెప్పుచుండుటచేత అందేది సత్యమో మనము సరిగా నిర్ధారణచేయఁజాలకున్నాము. పంజాబుదేశమునందు సిక్కుమతమును స్థాపించిన గురునానక మహాశయుఁడు తనయేకేశ్వరోపాసకధర్మములను కబీరుదాసుని గలసికొని సంభాషించిన తరువాతనే బాగుగ పాదుకొలుపుకొనియున్నందున, ఆసిక్కుమతవేదమయిన యాదిగ్రంథమునందు కబీరుదాసుని చరిత్రమును ఆతని బోధనలును విపులముగాఁ జేర్పఁబడియున్నవి కాఁబట్టి యందుండి కబీరునుగూర్చిన సంగతు లనేకములు మనము తెలిసికొనఁ గలుగుచున్నాము. కబీరునే యొక మతకర్తనుగా నెంచి యాతని మత మవలంభించు కబీరుపంథులను పేరఁ బిలువఁబడుచున్నవారు మనదేశమునందు దాదాపు తొమ్మిదిలక్షలమంది యున్నారు. వారు తమమతకర్తనుగూర్చి చెప్పెడి కథలును అనంతములుగానున్నవి. ఈయన్నిటినిబట్టియు కబీరు మహాభక్తాగ్రేసరుఁడయినట్లును గొప్ప మతసంస్కర్త యైనట్లును గ్రహింపవచ్చునుగాని యాతనిగురించి సరియైన చరిత్ర వ్రాయుటమాత్రము సాధ్యముకాదు.

కబీరు జన్మమునుగూర్చియు, అతని తల్లిదండ్రులనుగూర్చియు, కథ లనేకములు వాడుకలో నున్నవి. బాల్యమునందు కబీరు ఒక తురకసాలెవానియింట పెరిఁగినట్లుగా కబీరుపంథులు చెప్పుచున్నారు. సిక్కుమతగ్రంథమైన యాదిగ్రంథమందు కబీరు తురకసాలెవాఁడని నానక మహాత్ముఁడు బాబరుచక్రవర్తితోఁ జెప్పినట్లుగా వ్రాయఁబడియున్నది. కబీరుపాటలలోనే యొకదానిలో కబీరు తాను కొలఁదికాలములోనే నేతపని విడిచిపెట్టి కేవల హరినామస్మరణమునందే కాలము గడపఁబోవుచున్నానని చెప్పఁబడియున్నది. మఱియొకకీర్తనలో తాను పూర్వజన్మమందు బ్రాహ్మణుఁడైయుండి రామభజన చేయ మానుటచేత నీజన్మమందు తురకసాలెవాఁడుగా పుట్టినట్లు కబీరు చెప్పికొనియున్నాఁడు. అయినను, అతని తల్లి బ్రాహ్మణవితంతువై యుండినట్లును, ఆమె తనతండ్రితోఁగలసి తీర్థయాత్రలుసేయుచు నొకసన్యాసి నిలిచియుండిన దేవళమునకుఁబోఁగా నతఁడామెభక్తికి మెచ్చి 'నీకు పుత్రసంతాన మగుఁగాక' యని దీవించినట్లును, అంతటి మహానుభావుని దీవన మూరకే పోదు గనుక, యామె కొలఁది దినములకే గర్భవతియై లోకనిందకోడి ప్రసవమైనవెనుక తనకుఁ గలిగిన బిడ్డను బైట పాఱవేయఁగా నొక తురకసాలెవాని భార్యకు దొరకి యామె యపుత్రవతి యగుటచేత సంతోషముతోఁ దీసికొనిపోయి యాశిశువునకు కబీరను నామమునిడి ప్రేమతో పెంచినట్లును ఒకకథ చెప్పుచున్నారు. ఈకథకంటె ఈక్రిందికథ యింకెంత విచిత్రకల్పనలతో నిండియున్నది. ''పైలోకమునుండి దిగి యీలోకమున కబీరు అవతరించెను. కబీరు అవతరించిన తావున తామరపువ్వు వికసించుచుండెను. భ్రమరములు ఝుంకారములు చేసిచే

సి విసుగుజెందియుండెను. రాయంచలును భరద్వాజములును మఱి యితరపక్షులును ఆకసమున తమదారిని తా మెరిగిపోవుచు ఆతటాకముచుట్టును ప్రదక్షిణముచేసి మఱిపోవుచుండెను. ఆకమలాకరము మధ్యమున కమలగర్భమున కబీరు అవతరించినవేళ నుఱుములును మెఱుములును బ్రహ్మాండమున నిండియుండెను. 'నిరూ' యను సాలెవానిని పెండ్లియాడి యతనితోఁగలసి యత్త వారి యింటికిఁ బోవుచుండఁగా 'నిమా' యనునామెకు దారిలో దాహమయ్యెను. ఆమె యాతటాకమును సమీపించి యచ్చటనున్న యాశిశువును జూచి మిక్కిలి భీతిఁజెందినదయ్యెను. ఆశిశువునుజూచి యామె "ఎవ్వతెయో బాలవితంతువుయొక్క యవమానమున కిది ప్రత్యక్ష దర్శనము కాఁబోలును!" అని హృదయములో తలపోసెను. ఆబిడ్డను తమయింటికిఁ దీసికొనిపోదమని 'నిరూ' సూచించెనుగాని, యట్లుచేసినపక్షమున లేనిపోని లోకాపవాదము పాలవుదుమన్న భయముతో నిమా ముందుగా కొంచెము వెనుకదీసెను. "కమలములవంటి నేత్రములుఁగలిగి అత్యంతసౌందర్యముతో నలరారుచున్న యీపిన్నవానిని గన్న తల్లి యెవ్వతె?" యని యమ్మలక్కలడుగకుందురాయని వారిర్వురును గొంతసేపు తమలోఁదామ ఏమిసేయుటకును బాలుపోక శంకించిరిగాని తుదకు ఆభయములనన్నింటిని మూలఁద్రోసి యాశిశువుపైని కనికరము వహించిరి. వారిద్దఱును గృహము చేరినతోడనే స్త్రీలు మంగళగీతములుపాడి వారిని గృహప్రవేశము చేయించిరిగాని యాస్త్రీలు ఆశిశువు కంటఁబడిన తక్షణమే యేవేవో చెడ్డతలంపులు గలిగిఁ "ఈపిల్లవాఁడు దీనికి ఏలాగున కలిగినాడమ్మా!" యని తమలో తాము వితర్కించుకొనసాఁగిరి ఆది విని నిమా తాను ఆపిల్లవానిని కనకుండగనే సంపాదించితినని సమాధానము చెప్పఁగా, అప్పటినుండియు వారింక ప్రశ్నించుటగ మానివైచిరి."

ఈవిధముగా కబీరు జన్మవృత్తాంతము లనేకము లనేకవిధములుగా నున్నందున నందేదియు యథార్థమని మనము వక్కాణింపఁజాలము. అయినను కబీరు బాల్యమునందు మహమ్మదీయులయింట పెరిఁగినట్లుగా నన్నికథలును ఐకకంఠ్యముగా నుడువుచున్నందున మనము దానిని నిశ్చయముగా నమ్మవచ్చును. కబీరు బాల్యమున మహమ్మదీయుఁడైన సాలెవానియింట పెరుఁగుచున్నప్పుడే భక్తి యంకురించినట్లుగా చిహ్నములను గనబఱచుచుండెనని చెప్పుదురు. ఆతఁడు తనతోడివారైన హిందూబాలకులతోను మహమ్మదీయబాలురతోను ఆటలాడుకొనునప్పుడు సైతము తనభక్తిని గనఁబఱచి యాయుభయులకును కూడ కోపము కలిగించుచుండెనఁట! ఆటలసందడిని కబీరు రామ! రామ యనియు హరి! హరి! యనియు, కేకలువేయుచుండఁగాఁ జూచి వీఁడు పట్టి కాఫరు (నాస్తికుఁడు) అని తురకబాలకులు ఆతనిని నిందించుచుండిరనియు, దానికి క

కబీరు "ఎవఁడు చెడ్డపనిచేసిన, వాఁడే కాఫరు (నాస్తికుఁడు)" అని మాటలుపలుకుచుండెననియు, ఈవిధముగానే యొకసారి నుదుట బొట్టుపెట్టుకొని మెడలో జందెమువేసికొనఁగా తమయధికారమును దిక్కరించుచున్నాఁడని బ్రాహ్మణబాలకులచే మహాగ్రహముతో నిందింపఁబడి యీక్రిందిచందమున వారికి సమాధాన మిచ్చెననియుఁ జెప్పుచున్నారు.:—

"ఇదిగో! వినుఁడు నామతము! నాజిహ్వమే విష్ణువు, నానేత్రములే నారాయణుఁడు, గోవిందుఁడు నాడెందమునం దధివసించియున్నాఁడు. మీరు మృతులయిన వెనుక మీరు కావించియుండిన కర్మములనుగురించి యేమి సమాధానము చెప్పఁగలరు? నేను సాలెవాఁడను. కనుక నేను జందెము వేసికొందును. మీరు యజ్ఞోపవీతమును ధరింతురు; గాయత్రి పఠింతురు! దినదినమును గీతాపారాయణము చేయుదురు. కాని నాహృదయమునందే గోవిందుఁడు వసియించియున్నాఁడు. నేను పశువును, మీరు పసులకాపరులు. పాపములోఁ బడకుండ మమ్ము గాపాడవలసిన విధి మీది! మీరు బ్రాహ్మణులు, నేను కాశికానగరపు సాలెవాఁడను. నాబుద్ధి వినుఁడు! నేను హరిని ధ్యానించుచుండఁగా, మీరు ఎవ్వఁడో యొక యైహికవిభునిగూర్చి ప్రతిదినమును వెదకులాడుచుండెదరు!"

ఇట్లు కబీరు తన్ను నిందించువారికిఁ దగినట్లుగా సమాధానములు జెప్పుచు తనజ్ఞానాతిశయమును ప్రకటించుచువచ్చినను, తోడివారు మఱియేవిధమునను మాటుపలుకఁజాలక గురువులేనివాని మాట పాటింపరాదని యతనివాక్యములను త్రోసివేయఁ జొచ్చిరి. అప్పుడు కబీరు తనకు గురువులేఁడన్న లోపమునుగూడఁ దీసివేసికొని తరువాత ప్రజల కందఱకును తనమతమును బోధింపవలయునని నిశ్చయించెను. ఆకాలములో నుత్తరహిందూస్థానమున రామానందుఁడను భక్తవర్యుం డొక్కఁడు విఖ్యాతయశుఁడైయుండెను. కబీరు అతనిశిష్యుఁడుగఁ గావలయునని యెంచెను. కాని తురకవాఁడైన తన్ను రామానందుఁడు తనశిష్యవర్గములోఁ జేర్చుకొని యుపదేశమొనర్చుట యసాధ్యమని కబీరు గ్రహించినవాఁడై యందులకొక యుపాయమును పన్నెను. రామానందమతస్థులకు రామమంత్రమే ప్రధానమైనదని యతఁడు గ్రహించి, యొక్కనాఁడు సాధారణముగా రామానందుఁడు తెల్లవాఱుజామున గంగాస్నానము నేఘట్టమునొద్ద చేయునో ఆఘట్టమునొద్దసోపానములమీఁద దారికడ్డముగా పడియుండెను. చీఁకటిలో మెల్లగా నడుగులుపెట్టుకొనుచు వచ్చుచుండిన రామానందునిపాదము క్రిందఁ బడియున్న కబీరుమీఁద పడఁగా రామానందుఁ డులికిపడి "అయ్యో నిష్కారణముగ నేజంతువుమీదనో పాదములువైచి బాధించితి" నని తలఁచి "రామ! రామా!" యని పలికెను. కబీరు రామానందుని వెంటఁబడి యిప్పుడే గురూపదేశమైనది కాఁబట్టి తన్ను శిష్యునిగా గణియింపవలసినదని వేడుకొనెను. అతనిభక్తికి మెచ్చి రామానందుఁడు వెంటనే యతనిని తనఛాత్రునిగా నంగీకరించెను.

ఆనాటినుండియు కబీరు మతబోధన చేయుటలోను ఇతరులతో వాదించుటలోను, తాను రామానందుని శిష్యుఁడ నని చెప్పుకొన సాఁగెను. ఇతఁడు రామానందుని శిష్యుఁ డైనాఁడని విన్నతోడనే తమబాలకుఁడు పోయి పరమత మవలంబించి చెడిపోయినాఁడని మహమ్మదీయులును మతాంతరునికి రామానందుఁ డెట్లు మంత్రోపదేశము చేసినాఁడని హిందువులును, ఒక్కపెట్టున నివ్వెఱపాటు నొందిరి. అప్పు డుభయమతస్థులును గూడి రామానందునికడ కరిగి మీమతములో నొకతురక చిన్నవానిని జేర్చుకొంటి రేమి? యని యడిగిరి. ఆసంగతి తన కేమియుఁ దెలియనట్లు రామానందుఁడు పలికి యాచిన్నవానిని తనకడకుఁ గొనిరమ్మని కోరెను. కబీరు రామానందుని సన్నిధి కరిగిన తోడనె రామానందుఁ డడ్డముగా నొకతెర వేయించి తాను లోనఁ గూర్చుండి "నిన్నెప్పుడు నేను శిష్యునిగాఁ జేర్చుకొంటిని" అని బైటనున్న కబీరు నడిగెను. మహాత్మా! ఈలోకములో గురువులు తమ శిష్యులకుఁ జెవిలో నుపదేశించు మంత్రము లనేకములు. నాశిరమును గొట్టి మీరే యొకనాఁడు రామమంత్రమును దెలియఁ జేసితిరి." అని చెప్పినతోడనే రామానందుఁడు వెనుక జరిగిన సంగతినంతయు జ్ఞప్తికిఁ దెచ్చుకొని, యడ్డముగా వేయించిన తెరను త్రోసివేసి బైటికి వచ్చి కబీరుని కౌఁగిలించుకొని నిస్సందేహముగా నీవు నా శిష్యుఁడ వైతివి అని వక్కాణింపఁగా నచ్చటికి వచ్చినవారందఱును భంగపాటుతో నిండ్లకుఁ జనిరి. కబీరును తనయింటి కేఁగి నేత నేసికొనుచుఁ దనయింటికి వచ్చిన యతిథుల నభ్యాగతుల భక్తితాత్పర్యములతో నాదరించుచుండెను. ఎవ్వరైన సాధు లరుదెంచునపుడు వారికి అదివఱకు వాడియుండిన కుండలలోఁ గాక క్రొత్తకుండలలో నన్నము వండింపించి పెట్టుచు, ఆసాధువులకు హిందువుల పద్ధతులతో నేలను శుభ్రపఱచి యుచితాసనములు వెట్టుచు, వారు భిక్ష సేయుతఱిని తాను భక్తితో నెదుట నిలువఁబడుచు నుండుట జూచి యతని తల్లియైన నిమా మిక్కిలి యసహ్యతను బూని యాతని చేష్టితములన్నియు కులాచార విరుద్ధములుగా నుండెనని నిందించుచుండెను.

కబీరు బాల్యమునుండియు నిట్లు సాధుసాంగత్యము చేసి భక్తిజ్ఞానములు సంపా .ను. కబీరుయొక్క యుపదేశవాక్యము లనేకము లీతనికి హిందూమతసాంప్రదాయములు బాగుగఁ దెలిసియున్నట్లు ప్రబలసాక్ష్య మిచ్చుచున్నవి. ఈపరిజ్ఞానము చాలవఱ కతఁడు పండితులతో వాదములు సలిపి సంపాదించినదే. కబీరునకు గ్రంథపరిజ్ఞాన మంతగా లేదని చెప్పుదురు. అయినను పరులతో మతవిషయకమైన చర్చలు జరపియుండుటచేతను సూక్ష్మబుద్ధియు నపారభక్తియు విశేషచింతనయుఁ గలవాఁడగుటచేతను, అతని పరిజ్ఞాన మసమాన మయ్యెను.

కబీరుదాసునిభక్తి కేవల మీశ్వరధ్యానకీర్తనములందేగాక యీశ్వరప్రీతికరములైన కార్యములు చేయుటయందును వెల్లడియగుచుండెను. అతఁడు తాను వస్త్రములు నేసి

ష్కరియింపఁగా వచ్చిన యల్పధనములోఁ గొంత తనతల్లి కిచ్చి, తక్కువది సాధుల నాదరించుటయందును దీనులఁ బోషించుటయందును వినియోగపఱచుచుండెను. ఇతరు లెవ్వరు వనటఁ దూలుచున్నవారని విన్నను వారికిఁ దోడ్పడి వారియార్తి హరింపఁజేయుటకై యాకాల మాకాల మను నియమములేక యాతఁ డింటినుండి యాకస్మికముగా మాయమై పోవుచుండును.

కబీరు యావజ్జీవమును బ్రహ్మచర్యమునె నడపెనా? లేక వివాహితుఁడయి సంసారముచేసి బిడ్డలఁ గని కుటుంబి యయ్యెనా? యను విషయము పలువురు పలువిధముల నభిప్రాయపడుచున్నారు. అతఁడు లోయి యను కాంతను వివాహమాడి కమాల్ అను తనయుని, కమాలి యను తనయను, గాంచెనని యనేకులు తలంచుచున్నారు. ఈ తలంపునకుఁ గారణ మెట్టిదో, చాలకాలముక్రిందట బొంబాయినగరములోఁ బ్రచురింపబడిన కబీర్ కసౌతి యను హిందీగ్రంథమునందలి యీక్రింది సంగతులను జదివినపక్షమున తేటతెల్లమగునని యొకానొకరు వ్రాయుచున్నారు:—

కబీరుదాసునకు ముప్పదివర్షములప్రాయము వచ్చెను. అతఁ డొకానొకదినమున గంగానదీతీరమున నడచి పోవుచు, తుదకొక్క వనఖండిబైరాగి వసియించు కుటీరమును సమీపించి యచ్చటికిఁ బోయి కూర్చుండెను. కొంతవడికి అత్తావునకే యిర్వదియేండ్ల ప్రాయమున నున్న కన్నియ యొకర్తు వచ్చి, క్రొత్తగా వచ్చి విశ్రమించియున్న యాపురుషునిం జూచి "అయ్యా! మీ రెవ్వరు?" అని పృచ్ఛచేయఁగా, "నేను కబీరును" అని యతఁడు సమాధాన మిచ్చుటయు, నంతటితో నూరకుండక యాయువిద "మీవర్ణమెయ్యది? మీశాఖ యేది?" యని మరల ప్రశ్నచేసెను. ఈ రెండు ప్రశ్నలకునుగూడ "నేను కబీరును" అనియే పైరీతిని ప్రత్యుత్తర మీయఁగా, నింతవఱకు సాధులెందఱో యిచ్చటి కరుదెంచిరి గాని వారిలో నిట్లు తమపేరును వర్ణమును శాఖనుగూర్చి చెప్పిన వారొక్కరును లేరని యామె వచియించెను. "నేను చెప్పినదానిలో నసత్యమేదియు లేదు" అని కబీరు వక్కాణించెను. ఇట్లు చెప్పుటలో కబీరుయొక్క యుద్దేశము స్పష్టముగాఁ దెలియుచునే యున్నది. "కబీరు" అనఁగా మహాదేవుఁడైన పరమాత్ముఁడని యర్థము. తనకేమియు వర్ణభేదము లేదనియు, మనుష్యులందఱును దేవుని సేవకులే యనియుఁ సూచించి యీవిధముగా హిందూమహమ్మదీయుల నేకముచేయుటయే కబీరు తనసందేశముగాఁ జేసికొన్నట్లుగా నిట్టికథ లనేకములు స్పష్టపఱచుచున్నవి. ఇంతలో నచ్చటికి మఱికొందఱు సాధు లేగుదెంచిరి. తోడనే యాకన్యక తనకుటీరములోనికిం జని కుండతో పాలు తీసుకొనివచ్చి యేడుభాగములుగాఁ జేసె యం దైదు భాగములు

క్రొత్తగా వచ్చిన బైరాగులకును ఒకపాలుకబీరునకు నిచ్చి,తననిమిత్తమొకపాలుంచుకొని యెను.తనకిచ్చినభాగమును కబీరు త్రాగివేయకక్రిందఁబెట్టియుంచెను.తక్కినబైరాగులు తమ తమపాలను త్రాగివైచిరి. కబీరు త్రాగకుండుటకు వారు కారణ మడుగఁగా,గంగానది యావలియొడ్డునుండి యొకసాధువు వచ్చుచున్నాఁడనియు, తనపాలు అతనికొఱ కుంచితి ననియు కబీరు చెప్పఁగా 'స్వామీ! ఆసాధువు వచ్చినయెడల వానియొక్క వలయు నన్ని యున్నవి. ఈపాలు మీరు గ్రహింపుడు' అని యాబాలిక వేఁడుకొనియెను. "హరినామమే నా కాహారము' అని కబీరు పలికెను. ఇంతలో నవ్వలియొడ్డునుండి యొక సాధు వచ్చుటకు విచ్చేయఁగా, కబీరు తనవంతుపాలు వానికిచ్చివేసెను. అట్టి నిర్జనప్రదేశమున నొంటరిగా నుండుటకు హేతువేమనియు, తల్లిదండ్రు లెవ్వర లని యు, నంత నాకాంతను సాధువు లడుగ సాగిరి.అందున కామె తనతల్లిదండ్రులు జీవించి యుండ లేదనియు, తన్నొక్కసాధువు పెంచి పెద్దఁజేసెననియు, అతఁడు ముందు కొంత కాలమునకే యాతఁడును లోకాంతరగతుఁడైనందున తానొక్కతియే యుండుట తటస్థించినదనియుఁ దెలియఁజేసెను. అంతటితో వారు తృప్తి నొందక తక్కిన యుదంత మంతయు వినఁ గుతూహలము కలవారై 'అమ్మా! ఆసాధుపురుషుఁ డెవ్వఁడు? అతనునిన్నెందు బెట్టుకలిగెను?' నని మఱల నడుగుటయు, నామె యిట్లని యుత్తర మొసంగెను. "ఆసాధుపురుషుఁ డొకవనఖండపు బైరాగి. అతఁ డొక్క యావుపాలు మాత్రమే త్రాగి జీవించు వాఁడు. నాపూర్వ చరిత్రమును గూర్చి యితరు లాతని నడుగ నప్పు డిట్లు చెప్పుచుండెను. 'నేనొకనాడు గంగాతరంగిణిలో స్నానము చేయు చుండఁగా నొకతట్ట కొట్టుకొనివచ్చి నాకుఁ దగిలెను. అది పైకిఁ దీసి చూచినతోడనే యాఁడుశిశువు కనఁబడెను. అప్పు డాశిశువును కుటీరమునకుఁ గొనివచ్చి యావుపాలతో ముంచినవత్తితోఁ బెంచితిని. మొదట నాకు తట్టలో దొరికినప్పు డీబిడ్డ దుప్పటిలోఁ గప్పి యుంచఁబడియుండుటచేత 'లోయి' (దుప్పటి)యనుపేరు పెట్టితిని. ఈవిధముగా నన్నుఁ గూర్చి యాస్వామి సాధులతోఁ జెప్పుచుండఁగా నేను వినియుంటిని.'

కబీరు యొక్క సాధుస్వభావమును గురులక్షణమును గాంచి లోయి యాతని నుద్దేశించి "స్వామీ! నాకు చిత్తశాంతిని ప్రసాదింపఁగల సదుపదేశము చేయుఁ,, డని పలికెను. ఆబాలిక భక్తివిశ్వాసములు దీపింప, చిత్తశుద్ధి యొసంగ, నిట్లు వేఁడికొన్నం దులకు కబీరు సంతోషతరంగితస్వాంతుడై "నిత్యమును సత్యనామమును స్మరియింపుము, సాధుసేవ గావించుకొనుచుఁ గాలము గడపుము,, అని యుపదేశించుటయు, లోయి యా వాక్యములఁ దలఁ దాల్చి, యైహికవిషయచింతనమును దెగనాడి, వారణాసికిఁ బోయి, సాధుసేవ యొనరించుచుఁ బ్రొద్దులు పుచ్చ సాఁగెను. ఇట్లు కబీరు తనతో

నీకాంతను కాశికిఁ గొనివచ్చుట చూచి యతఁడామెను చేపట్టినట్టుగా భ్రమపడి నీమా, యాతనిం గని "యిట్లాయె, బిడ్డా! లోయితోఁ గాపురము చేయక వేఱుగా నుంటివి కదా? ఇంక నీవామెను పెండ్లియాడిన ప్రయోజనమేమి?" ఇట్లే పలువురు కబీరు వివాహితుఁ డైనట్లు భావించి లేని పోని కథ లల్లఁ జొచ్చిరి.

లోయియును కబీరును భార్యాభర్తృసంబంధము కలవారని లోకము భ్రమపడుటకు మఱియొక కారణము కూడ తోడయ్యెను. ఒకనాఁడు కబీరు వేఱొక భక్తునితోఁ గలసి గంగానదీతీరమున నడచుచుండఁగా, నదిలోఁ గొట్టుకొని పోవుచుండిన యొకశిశువు కానవచ్చెనఁట! అసహాయుని కోరికపై కబీరు ప్రవాహములోఁ బడి కొట్టుకొని పోవు శిశువును పైకిఁ దీసి, యాశిశువు చెవిలో భగవన్నామము స్మరియించి బ్రతికించి, తోడ గొనివచ్చి లోయి కిచ్చి పెంపవలసిన దని చెప్పఁగా నామె మక్కువతో నాశిశువును పెంచి పెద్దవానిం జేసె నఁట! ఆశిశువు సౌందర్యాతిశయముఁ జూచి నప్పుడే కబీరు ఆబిడ్డనికిఁ "కమాల్" (పరిపూర్ణార్థకపదము)అను పేరుపెట్టెనఁట! ఇది చూచి కొందఱు కబీరు మృతు లయిన వారిని బ్రతికింపఁగల మహాత్ముఁ డని నమ్మసాగిరి. మఱి కొందఱు ఆబిడ్డఁడు కబీరునకు లోయి వలనఁ గలిగినవాఁడే యని యూహించిరి.

ఇట్లుండ మఱియొక్కనాఁడు కబీరు ఒకరి గృహములో నుండఁగా వారి యాఁడుశిశు వొక్కతె మరణింపఁ దటస్థించెనఁట! మరణించిన బిడ్డను గని తల్లిదండ్రు లాక్రందనము సేయుచుండఁ గాంచి కబీరు తన కామృతశిశువు నీయవలసిన దని యడుగుటయు, అంతకు మున్నె తన దివ్యమంత్రప్రభావముచేత కమాలును బ్రదికించిన మహానుభావుఁ డని విని యున్నది కావున శిశువుతల్లి యందుల కంగీకరించె నఁట! అనంతరము కబీరు దివ్యశబ్దపునశ్చరణము చేసి యా శిశువును పునరుజ్జీవింపఁ జేసి, కమాలి యను నామ మొసంగి యాయాఁడుపిల్లను గూడఁ బెంపవలసిన దని లోయి కిచ్చివేసెనఁట. ఇట్లు కబీరుచే బ్రతికింపఁ బడిన పిల్ల లిద్దఱును వయసు వచ్చిన తరువాత కబీరును తాము, "స్వామి! స్వామి!" యనిపిలుచుచు నాతని గృహమునందేయుండి వస్త్రములు నేయుటలో నాతనికిఁ దోడుపడుచుండి నట్లు తెలియవచ్చుచున్నది. అందుచే వీరిద్దఱును కబీరుదాసునకుఁ గలిగిన బిడ్డలే యని లోకులు తలంప సాగిరి.

కమాలి యొక్క తరువాతి చరిత్ర సంగ్రహముగా నిట తెలుపవలసియున్నది. ఆమె యౌవనవతియై యిరువదియేండ్ల ప్రాయము వచ్చియున్నప్పుడు ఒక్కనాఁడు కబీరుదాసు గృహము చెంత నున్న నూతిలో నీళ్లుతోడుకొనుచుండగా, మార్గాయాసముచే గడు దప్పి పిపాసాపీడితుఁ డైన యొక బ్రాహ్మణపండితుఁ డాదారిని బోవుచు, నీరుపట్టు

చేతఁ గోవలయునని యాకాంతచెంత కేతెంచి యిన్ని నీళ్లుచేఁది పోయు మని యడిగెను. ఆపండితుఁడు కమాలి కృపాయత్తచిత్తముతోఁ దోడి యిచ్చిన చల్లని జలముల మనసారఁ ద్రాగి, యనంతరము "కాంతా! నీ వెవ్వరి కుమార్తెవో గాని ధన్యురాలవు సుమీ!" యని యామె యుదంతమును గొంత తెలిసికొనఁగోరెను. కాని, యామె తురక సాలెవాని తనయ యని తెలిపినతోడనే గుండెలో రాయిపడి "నాకొంప దీసి నాకులముఁ జెఱచి నన్ను వర్ణభ్రష్టుని జేసితివి కదే!" యని యెంతయు వాపోవఁ దొడంగెను. ఆ పురుషుఁ డిట్లు క్రోధావేశపరవశుఁడై దురంతచింతాక్రాంతుఁ డగుటకుఁ గారణ మేమి కానోపునో యూహింప నేరక, కమాలి యాతనిని వచ్చి కబీరుతో సంభాషించి పొమ్మని కోరుటయు నీమాటలువిని కబీరు ఈక్రింది చందమున సమాధానమిచ్చెను:—

"ఓ బ్రాహ్మణా! జలపానము సేయుటకు ముందీయంశములను గమనించి విచారించునది. మైలపడుట యన నేమి? చేఁపలు, తాఁబేళ్లు, రక్తము, ఉప్పు, కత్తి, చెదారము, మృతకళేబరములు, —ఇవన్నియు నీటఁ దడిసియుండును. కొలఁకులయందు లక్షోపలక్ష జనులు మృతు లగుచున్నారు. నీవు ముందునకు పెట్టి నట్టి యడుగడుగునకును ఎన్నఁడో మృతుఁ డయిన యెవ్వాని దేహము మీఁద నుండియో త్రొక్కికొనుచునే పోవుచున్నావు. అట్టి మట్టితోఁ జేయఁబడిన పాత్రములతోనే కదా నీవు నిత్యమును నీరు త్రాగుచున్నది? మైల కలుగు నన్న భీతితో భోజనవేళ కట్టువస్త్రములఁ దీసివైచి సాలెవానిచే నేయఁబడిన దోవతుల మెడల్లఁ గప్పుకొనుచున్నావే కాని, మలినపదార్థముల మీఁదినుండి యెగిరివచ్చి యీఁగలు నీవు భుజింపఁబోవు నాహారము మీఁద వ్రాలుచుండుటను గనఁజాలకున్నావు. దీనిని నీ వెట్లు లక్ష్యపెట్టగలవు చెప్పుమా? అట్టి నట్టి భ్రమలను మనసునుండి పాఱఁదోలి వేదములఁ బఠించి, రాముని శరణు జొచ్చుమా!" ఈవాక్యములను విన్న యాబ్రాహ్మణుఁడు తనలో నా తురకసాలెవాఁడు నిశ్చయముగా మహాత్ముఁడై యుండవలయు నని తలంచి, యింకను తనకు జ్ఞానబోధన చేయు మని భక్తిపూర్వకముగా వేఁడుకొనియెను. కబీరు అందులకు సమ్మతించి యీశ్వరగుణగణములను గూర్చియు, ఏకేశ్వరారాధనావశ్యకతను గూర్చియు, తనయభిప్రాయములఁ దెలుపుచు నుపదేశించెను. ఆయుపదేశము చేసినతోడనే యందలి సత్యమును దెలిసి యాబ్రాహ్మణ పండితుఁడు కబీరుమహాశయుఁ డుపదేశించిన సద్ధర్మముల నన్నింటిని స్వీకరించెను. స్వీకరించిన సద్ధర్మము స్వాచరణమునందు సువ్యక్త మయినప్పుడే శోభఁజెంది యుపయుక్త మగునుకదా! ఆబ్రాహ్మణుని యంగీకారమును బడసి, కబీరు తనపెంపుడు కూఁతురైన కమాలి నిచ్చి యాతనికి వివాహము చేసెను. ఈవిధముగా కబీరు సత్యబోధనము విజయము గాంచుచు, బహుదేవతారాధనపరులై విగ్రహపూజాసక్తులై

జాతివిద్వేషపూరితులై యుండినవారిని, ఏకదైవతోపాసకులుగాను సమదర్శులుగాను క్రమముగా మార్పఁ గలుగుచుండెను.

సామాన్యుఁడును, గ్రంథపరిజ్ఞాన మంతగా లేని వాఁడును, అయిన యాతని బోధనలు ఇట్టి మహత్తరశక్తి కల వగుట కేమి రహస్యమున్నది? వేదవిదు లయిన పండితోత్తములు, శాస్త్రపరిచితి గల విజ్ఞులు, కబీరుతో వాదింపజాల కుండిరి. అతని సత్యబోధనప్రభావము నెదుట నన్యుల ప్రజ్ఞలు తమతమ తలలు వాంచుచుండెడివి. దీనికిఁ గారణ మేమి? సకల సత్యములకును మూలమైనవాఁడును, అలఘు దుర్జ్ఞానతిమిరములకు నెల్ల నమోఘప్రభాకరుఁడును అయినవిశ్వేశుని కబీరు తన హృదయమునఁ గనఁ జాలెను. అట్టి సర్వశక్తిమయుని ప్రాపు నమ్మినప్పుడు అట్టి వానికి మఱే కొఱఁత యుండును? భక్తిప్రభావముచే తనకట్టి యానందము, అట్టి మహత్తరశక్తి, కలిగెనవని గ్రహించినవాఁ డగుట చేతనే, తోడి మానవుల నీశ్వర సాక్షాత్కారము నుండి మఱుఁగుపఱుచుచుండిన బహుదేవతారాధనము వ్యర్థకర్మాచరణ పటుత్వము, ద్వేషము, మాలిన్యము, మున్నగు వాని నన్నింటిని తీవ్రతరముగ ఖండించుచు దేశదేశముల గ్రామగ్రామములు తిరిగి జనసామాన్యము ఏకదైవమతోపాసనావశ్యకతను గ్రహించి, యసన్మార్గమును వీడు నట్లు చేయవలయు నని యతఁడు బోధించుచుండెను. కబీరు బోధనపద్ధతి మిక్కిలి యద్భుతమైనది. అతఁడు విగ్రహార్చనమును ఖండించు నట్టియు, వ్యర్థకర్మమున నిస్సారతను వ్యక్తముచేయు నట్టియు, బ్రహ్మజ్ఞానమును బోధించునట్టియు, నీతివర్తనమును గఱపు నట్టియు, స్వకీయములయిన భగవత్కీర్తనలను పాడుకొనుచు, వీథుల వెంబడి నూరూరు తిరిగి పోవుచుండును. జనులు గుంపులుగా వచ్చి యాతని హితబోధ యాలించుచుందురు. జనులు సాధారణముగా నజ్ఞానవిమోహితులై ఐహికజీవనమే శాశ్వతమనియు, ఐహికసౌఖ్యములను పొంద ప్రయత్నించుటే మనుగడ యొక్క సార్థకత యనియు, నమ్మి నిత్యానిత్యవిచారము లేక వర్తించుచుందురు. అట్టి వా రందఱును నిత్యసౌఖ్యప్రద మైన భగవత్సేవను చేయ మఱవవల దని యాతఁ డుపదేశించెను. చాలమంది యీశ్వరతత్త్వమును గ్రహింప నేరక బహుదేవతలను నమ్మి రాలను రప్పలను గొలిచి వెట్టిసంతుష్టి నందుచు, నీశ్వరారాధనము వలనఁ బొందవలసిన యానందమును బలమును బొంద నేరక దుర్గతుల పా లగుచున్నారు. అట్టి పామరజనాళి కెల్ల దేవుఁ డొక్కఁడే సమస్తజనసంసేవ్యుఁ డనియు, భగవద్భక్తికి పరమశత్రువు అయిన స్వార్థపరత్వము, దురహంకారము, ధనకాంక్ష, విషయలోలత, మున్నగువానిని పరిత్యజింప వలయు ననియు, ఒక్క పరమాత్ముని గొల్వఁగాఁ గలుగు నానందముతో ఇహలోకములో సంపన్నత్వాదులచేఁ గలుగు తాత్కాలిక సౌఖ్యము లెన్నియును

తుల్యము కానేరవనియు, నాతఁడు తెలిపెను. ఒక్కఁడే భగవంతుఁడను పరిజ్ఞానమును విడనాడి తమలో తాము మతభేదములను వర్ణభేదములను కల్పించుకొనుచుఁ జెడువారి దుస్థితిని జూచి యాతఁడు నిజముగా శోకించుచుండును. మతభేదముల వలనను, జాతి విద్వేషముల వలనను, కలిగిన మహాయుద్ధముల వలనను, కలుగుచున్న బ్రజల విరోధముల వలనను, మానవసంఘ మేరీతి దుర్గతులఁబడుచుండెనో యాతఁడు బాగుగ గ్రహించిన వాఁ డగుటచే సంఘాభివృద్ధి కవి వేరుపురుగు లని పలుమా ఱుద్ఘోషింప సాగెను. ఈశ్వరుని సమీపించు నట్టి యధికారమునకు వారు వీ రను నంతరము లేక యెల్లవారును సములే యనియు, వివేకమును విడనాడి ప్రతిపూర్వాచారమునకును దాసులై యుండుటయు మతసిద్ధాంతములను గూర్చి కేవలవాదాపేక్షతోఁ దగవు లాడుచుండుటయు, నెవ్వారికిఁ దగ దనియు, భక్తివిశ్వాసముల చేతనే గాని కేవలకర్మాచరణముచే ముక్తి చేకూరనేర దనియు, సంపూర్ణభగవద్భక్తి సమస్తభయములను భంజింపఁజాలు ననియు, నాతఁ డుపదేశించిన యుపదేశములు మిక్కిలి యుత్తమములై యున్నవి.

కబీరు జనుల కుపదేశించు పద్ధతిని బాగుగఁ దెలుపుటకై యొకటి రెండు కథలను దెలిపెదను. హిందువులు కొన్ని నదులను పవిత్రముగా నెంచి యచ్చటికే దీర్ఘయాత్రలు సేయుచు, అందు స్నాన మాచరించినందుననే తమ కావించిన సమస్తదోషములను హరించు నని విశ్వసింతురు. అట్టి వారి కడకుఁ బోయి కబీరు సత్యజ్ఞానమును గీతములతోఁ దెలుపుచుండెను. ఒకనాఁడు బ్రాహ్మణులు కొందఱు చేరి గంగాజలము పాపులను పవిత్రులను గాఁ జేయు సమర్థత కల దని యుగ్గడించుచుండిరి. ఆమాటలు విని కబీరు తోడనె తన కమండలువు నిండ గంగాజలమును దీసికొని వచ్చి వారి నా నీరు త్రాగవలసినదని యడిగెను. అధమజాతివాని చేతి నీరు త్రాగుట యన్న తోడనే మిక్కిలి యేవపడి వారంగీకరింపరైరి. అంత కబీరు వారినవలోకించి "అయ్యా! గంగానదీజలము నా పాత్రమునే పరిశుద్ధము చేయఁజాల నప్పుడు అది నాపాపముల నెల్ల హరించి వేయఁ గల దని యెట్లు నమ్ముదును?" అని బుద్ధివచ్చునట్లు పలికెనట. ఈ సందర్భమున నాతని యుపదేశములు కొన్ని యుదాహరింపవలసి యున్నది.

"కబీరు చెప్పుచున్నాఁడు.—నా కేమియుఁ దెలియకున్నది? తీర్థమెక్కడ? హరివాసుఁ డెక్కడ?"

"జలము సమీపముననే యున్నది. కాని యందులోనే నడచిపోవుచు పశువులు దానిని త్రాగకున్నవి. తఱుచు హరినామస్మరణము సేయుచున్న పక్షమున జలము పొంగి రాఁగలదు. ఆజలమే పరిశుద్ధమైనది. ఇది కబీరు వాక్యము."

"వాని హృదయములో కల్మష మున్నది. తీర్థము నొద్ద స్నాన మాచరించినను వాఁడు మోక్షమును పొందఁడు. జనులకు నమ్మక మున్నంత మాత్రము చేత నేమియు జరుగదు. రాముఁడు తెలివి తక్కువ వాఁడు కాఁడు."

ఆకాలములో విగ్రహారాధనము ప్రబలమై జనులను నష్టవివేకులనుగఁ జేసిన దనియు, అట్టి నీచస్థితిలో నున్న వారి నుద్ధరింపవలయు నని కబీరు గట్టిగా సమకట్టె ననియు నింతకు ముందే సూచింపఁబడినది.

ధర్మదాసను వైశ్యుఁ డొకఁ డుండెను. అతఁడు మిగుల భాగ్యవంతుఁడై నిత్యమును సాలిగ్రామపూజ గావించుచు, భాగవతులను వైరాగులను సత్కరించుచు, భగవద్గీతాపారాయణ మొనర్చుచు శ్రీకృష్ణుని గొనియాడుచు, అత్యంతశాంతికొఱకై పుణ్యక్షేత్రముల కెల్ల నేగుచుండెను. అతని కొక్కనాఁడు కాశీకానగరమునందు కబీరుదాసు దర్శనము ప్రాపించెను. ధర్మదాసుని యుదంతము విన్నతోడనే కబీరు విగ్రహార్చనమును విడనాడి మనస్సు నీశ్వరుని వైపునకు మరల్పనంతకాల మాతనికి నిక్కమైన శాంతి చేకూరనేర దని బోధించెను. తర్వాతఁ గొంతకాలమునకు ధర్మదాసు బృందావనమునందు కబీరు కంటఁబడఁగా, నాతఁ డింకను విగ్రహపూజను బరిత్యజింపలే దని విన్నతోడనే, ఖండితముగా నతనితో నది కూడ దని వక్కాణించి యాతఁడు పూజించు సాలిగ్రామమును గైకొని కబీరు దానిని గంగలోఁ బారవైచెను. మఱికొంతకాలమునకు మఱల వారిరువురును గలసికొన్నప్పుడు గైతము అతఁ డింకను ఱాలఁ గొలుచుట మానలే దని తెలిసికొని కబీరు ఇట్లనియె;—"ఓయీ! ధర్మదాసా! నీవు నీవ్యాపారమునం దుపయోగించు తూనికఱాళ్లు వేనితోఁ జేయఁబడినవో వానితోనే చేయఁబడిన విగ్రహములను నీ వెట్లు దైవతములని పూజింప నేర్తువో యాశ్చర్యకరముగా నున్నది." ఈవాక్కులు ధర్మదాసుని మనమ్మున జక్కఁగా నాటెను. అప్పటినుండి ధర్మదాసు ధర్మపత్నీ సమేతముగా కబీరుమార్గము నవలంబించి యుండెను. మతమహావృక్షమునకు వేరుపురుగనందగిన విగ్రహారాధనమును రూపుమాపి యెల్లయెడల ప్రజల జ్ఞాననేత్రము విప్పవలయు నని కబీరు మిక్కిలి యభిలషించుచు, అందుకొఱకై నిరంతరము విచారించు స్వభావముకలవాఁ డగునట్లు ఇట్టి కథలే గాక యాతనిచే నుపదేశింపఁబడిన ధర్మములును స్పష్టముగాఁ దెలుపుచున్నవి. "ఓసాధులారా! లోకము పిచ్చిమార్గమునఁ బడిపోయినది. నేను సత్యముఁ జెప్పితినేని లోకులు నన్నుఁ జంపుటకై నామీఁద పడవత్తురు. వారు కేవలాసత్యమునె విశ్వసింతురు. క్రమము దప్పక నిత్యమును ప్రాతఃకాలమున స్నానములుచేయు భక్తిప్రపత్తిసంపన్నులను నే నెందఱినో చూచియున్నాను! కాని వారు భగవంతుని వర్జించి

ఱాలను భజింతురు. వారికి నిజముగా వివేకము లేదు. వారు రాగిబొమ్మలను రాళ్ళను పూజింప మొదలుపెట్టి, తాము తీర్థయాత్రలు చేయుచుంటి మని సంతుష్టులై గర్వించుచున్నారు. వారు తావళములు ధరించి, నామములు టోపీలు చక్రాంకితములు పూని తమతమ దేవతలను స్తుతించి కీర్తించుచు కాలము గడపుచున్నారు; వారు భగవంతుని వర్జించివేసినారు, ఱాలను పూజించినందువలన నొకనికి ఈశ్వరసాక్షాత్కార మయ్యెడు పక్షమున, నేను మహాపర్వతము నొకదానిని పూజించెదను. ఈజాతి విగ్రహములకంటె ఇంకను మనుష్యులు బియ్యము విసరుకొను తిరుగలిఱాళ్లు నయము. తమ పాదముల మీఁద సైతము పడి కన్నులనీరు గారునట్లుగా నే నెంత ప్రార్థించినను హిందువులు విగ్రహారాధనమును విడువకున్నారు; మహమ్మదీయులు తలబిరుసుదనముచేత తమమూర్ఖతను బాయకున్నారు." ఇట్టి యుపదేశవాక్యములు కబీరు చెప్పినవి యనేకములు కలవు.

ఈవిధముగా కబీరు ధీరచిత్తుఁడై హిందూమతలోపములను మహమ్మదీయుల దుర్వర్తనములను బహిరంగముగా ఖండించుచుండుటచేత ఆయుభయులందును గూడ నతనికి శత్రువుల నేకులు బయలుదేరిరి. తురకలలో కొందఱు ప్రముఖులు బయల్వెడలి కబీరు భగవంతుని కున్న 'లక్షణములు తానే కలిగి యున్నట్లుగా చాటుచున్నాఁడనియు అందుచేత మహమ్మదీయ మతధర్మము ననుసరించి యాతఁడు తప్పక వధ్యుఁ డనియు అప్పుడు చక్రవర్తిగా నున్న సికందరులోడీ కడకుఁ బోయి మొఱ్ఱపెట్టుకొనిరి. అప్పుడు కబీరును పట్టి బంధించి తనయెదుటికిఁ గొనిరావలసిన దని చక్రవర్తి యుత్తరు వీయగా భటులు పోయి కబీరును గలసికొని సంగతి తెలిపి సాయంకాలమునకు గాని యాతని నొప్పించి చక్రవర్తి సన్నిధికి దీసికొని రాజాలరైరి. ఉదయముననే రావలసినదని యుత్తరు వీయఁగా సాయంకాలము వఱకును తడసి రాకుండుటకు హేతు వేమని చక్రవర్తి కబీరు నడిగెను. ఇంతలో కబీరు చక్రవర్తికి మొక్కకుండుటను జూచి యచ్చటి యాచార్యుఁ డొకఁడు 'ఓరీ కాఫరా! (నాస్తికుఁడా) చక్రవర్తికి నీ వేల మ్రొక్కకున్నావు?' అని యడుగ, 'అన్యులబాధల నెవ్వాఁడు గ్రహించునో వాఁడే పీరు; అట్లు చేయఁజాలని వారే కాఫరులు' అని సమాధానమిచ్చి, చక్రవర్తిని జూచి, తాను వచ్చుచుండఁగా నొకవిచిత్రము కనఁబడి తనదృష్టి నరికట్టినందున తా నంతవఱకు నాలస్యము చేయవలసి వచ్చె నని యుత్తర మిచ్చెను. చక్రవర్తియాజ్ఞల సైతము ల్లంఘింపఁ దగినంతటిది యేమి కనఁబడిన దని మరల చక్రవర్తి యడుగ, సూదిబెజ్జముకంటె సన్నముగా నున్న యొక వీథిలో నుండి గుంపుగుంపులుగా నొంటెలు పోవుచుండఁగాఁ జూచితి నని కబీరు

చెప్పెను. అది కేవల మసత్య మని చక్రవర్తి యనెను. అంత కబీరు 'ప్రభువరా! ఆకసమునకును భూమికిని మధ్యమం దెంతదూర మున్నదో కొంచె మాలోచింపుము. సూర్యచంద్రులమధ్యమం దున్న స్థలములో నసంఖ్యము లయిన యేనుంగులును లొట్టియలును ఉండవచ్చును; అవన్నియుఁ గూడ సూదిబెజ్జముకంటె సన్నముగా నున్న కంటిపాపగుండఁ జూడవచ్చును గదా!' యని ప్రత్యుత్తర మీయఁగా, దీనితో సంతుష్టిపొంది చక్రవర్తి యాతనిజ్ఞానము గ్రహించి, కబీరును విడిచిపెట్టెను. చక్రవర్తి యిట్లు ఆతనిని విడిచిపెట్టినందులకుఁ దమలో దాము గొణుగుకో సాగిరి. తరువాత, బ్రాహ్మణులును కబీరు అనుమానాస్పదమైన వర్తనముగల స్త్రీతో వర్తించుచున్నాఁ డనియు, రామదాసను మాదిగవానిని భక్తుని జేసి యాతనితోఁ గలసి తిరుగుచున్నాఁ డనియు నిందింపఁ జొచ్చిరి. కబీరు తనమతధర్మములను చక్రవర్తికిఁ దెలిపినట్లును, చక్రవర్తి ప్రజలపక్షము నే వహించి కడకు కబీరును చంపివేయవలసిన దని యుత్తరు విచ్చినట్లును, కబీరు తనమహిమచేత పలుమారు మృతిని దప్పించుకొని చెక్కుచెదరక పైకి వచ్చినట్లును, అంత చక్రవర్తి యాతనిమహత్త్వమును గ్రహించి తాముచేసిన యకార్యములకై తన కేమి శిక్ష విధించెదవని యడుగఁగా కబీరు సజ్జనుఁ డెప్పుడును తనపాదములక్రింద ముండ్లను జల్లువారి పదములక్రింద పూలు చల్లవలయు నన్న సద్ధర్మమును దెలిపినట్లును, ఒకకథ చెప్పుదురు, కాని యది యెంతవఱకు విశ్వసింపఁదగినదో మనము చెప్పఁజాలము.

కబీరు మృతిఁజెందులోపలఁ జేసిన మహత్తరకార్యము లెన్నో చెప్పబడుచున్నవి. కాని యవి సత్యము లయినను కాకపోయినను అతని సత్స్వభావమును భక్తివైరాగ్యములను ఆయన్నింటివలనను సువ్యక్త మగుచున్న దన్న యంశ మొక్కటి మనకుఁ జాలును. అవసానదశ ప్రాపించువాటికి కబీరు మిక్కిలి వార్ధక్యములో నుండెను. అతఁడు కాశిలో నివసించుట మాని కడదినములను మాఘూరుపట్టణమునందుఁ గడపెను. తొల్లింటివలె కర్ణరసాయనముగ మధురగానముతో భగవత్కీర్తనములు పాడుచు చితారుపై వాయించుటకు వీలులేకుండునట్లుగా చేతులు పడిపోయెను. కాశీనగరమునందు తన్నుఁ జూడవచ్చి తనతో భగవద్ధ్యానము చేయు భక్తులును మిత్రులును నేఁడు తమమోము చూపకుండిరి. ఇట్లు తా నొంటరిగా కాలము గడపుచున్నను కబీరు తన కేకాంతవాసము కలిగిన దని యెన్నఁడును దుఃఖింపలేదు. తనప్రాణనాథుఁ డైన పరమేశ్వరుఁడే తనచెంత నుండఁగా మఱెవ్వరు లేకున్న నేమి యని యతఁడు నిశ్చింతతో పరమసంతుష్టితో నుండెను.

ఈచందమున మాఘూర్‌పురమునందు కబీరు నిశ్చింతతోఁ దనయంత్యదినములను గడుపుచున్నను, అతని శిష్యవర్గము మాత్ర మతఁ డచ్చట నుండుట సమ్మతింపలేదు. దీని కొక కారణము కలదు. కాశిం జచ్చినవా రందఱును అనాయాసముగా కైవల్య మందుదు రనియు, మాఘూరులో మరణించినవా రందఱును మఱల నీలోకమునందే గార్దభజన్మము నెత్తవలసినవా రగుదు రనియు, అందుచేత పుణ్యక్షేత్రమైన కాశికయందే మరణించువఱకును నిలిచియుండుట మంచి దనియు కబీరునకు వారు హితబోధ చేసిరి. ఈవాక్యములను విన్నతోడనే వారివిశ్వాసరాహిత్యమునకు కబీరు నిందించి శివనివాసమైన కాశీనగరమందుఁ గాక వేఱొక చోట తనభక్తుఁ డొకఁడు ప్రాణములు విడువ నిచ్చగించుచుండఁగా వానికి విముక్తి నియ్య జాలనంత యత్యల్పముగా నున్నదా యేమి శ్రీరామమహిమ? యని వక్కాణించెను.

గీ॥ భక్తిని మాఘూ రదేమి? కాశిక యదేమి?
చావలేదు మాఘూరునఁ జచ్చునతఁడు
తనర రాముండు వానిచిత్తమున నిలువ;
నిట్టు లెంచక పెఱచోట నెవఁడు జచ్చు
వాఁడు రాముని నపకీర్తి పాలుసేయు.

అని కబీరుదాసుఁడు ఆట్టి యవసయందే యొక్క కీర్తనము చేసెను. దీనింబట్టి భగవంతుఁడు సర్వవ్యాపియై సమదర్శియై యున్నాఁడన్న విశ్వాసము స్వానుభవసిద్ధమై కబీరుని హృదయమునం దెంతదిటవుగా నెలకొనియున్నదో స్పష్టమగుటయేగాక, దుర్భరమైన వార్ధకబాధ యతిశయించి, లోకములోని యేవిషయములును చిత్తశాంతిని కలిగింపనేరక, యెట్టి మిత్రబాంధవులును అంతరంగమున కూఱట కలిగింపఁజాలక, యున్న యవసరమున నాతని కంతటి మహత్తరశాంతి నిలిచియుండుటకు రహస్య మేదిగా నుండెనో కూడ వెల్లడి యగుచున్నది.

కబీరుమృతినిగూర్చి యాశ్చర్యజనకములైన కథ లనేకములు చెప్పుచున్నారు. అతఁడు సిద్ధిపొందిన తోడనే మహమ్మదీయులు చేరి యతఁడు తమమతస్థుఁ డగుటచేఁ దమమతాచారము చొప్పున ఖననముచేసి గోరీకట్టవలయు ననియు, హిందువులు వచ్చి యాతఁడు తమమతస్థుఁడే యగుటచే దహ

నమే చేయవలయు ననియు, తమలో తాము పోరాడుచు శవముకొఱకై మిక్కిలి పెనఁగులాడఁజొచ్చిరి. ఇట్లీయుభయుల వైరములును దురంతములై మిన్నుముట్టుచుండఁగా కబీరే వారి కప్పుడు ప్రత్యక్షమై వారిని వారించి తన మృతశరీరముపైఁ గప్పఁబడియుండిన వస్త్రమును తొలఁగింపుఁడని యాజ్ఞాపించుటయు, వా రట్లు చేసిచూడఁగా లోనుండిన శవ మద్భుతముగా మాయమైపోయి, కొన్నిపుష్పములు మాత్ర మాతావున నుండెనఁట! ఈపువ్వులను గొన్నిటిని హిందువులు చేకొనిపోయి కాశీనగరమందు గంగానదియొడ్డున యథావిధిగ దహనముచేసిరఁట! తక్కినవానిని మహమ్మదీయులు గైకొని మాఘూరునందే ఖననముచేసి గోరీ నిలిపిరఁట!

ఈకథ విశ్వాసపాత్రమైనదైనను కాకపోయినను, ఒక్కకబీరునుగుఱించియే కాక మహాత్ములైనవారందఱి చరిత్రములకు సంబంధించియు కొన్ని గొప్ప సత్యములను దెలుపుచున్న దనుటకు సందియము లేదు. ఈలోకములో నేమహాత్ముఁడు కాని సాధారణముగాఁ దనకాలమునందే లోకముచే గౌరవింపఁబడఁడు. ఒకమహాత్ముఁడు జనసామాన్యముయొక్క దుస్థితిని గ్రహించి వారి నుద్ధరించుటకై యున్నతసందేశమును గొనివచ్చినప్పుడు వారు దానిని తెలియఁజాలక వ్యాధిగ్రస్తుఁడగువాఁడు మిత్రవైద్యుఁ డీఁబోయిన మందును త్రోచిపుచ్చునట్లుగా, మొట్టమొదట నాయుపదేశములను వెగటుగాఁ జూచి కొంతకాలమైన వెనుక వానియావశ్యకతను గ్రహింపఁగల్గుచుండుట లోకసామాన్యమైయున్నది ఇందు మఱియొక గొప్పవిశేష మున్నది మహాత్ము లెప్పుడును ఒక్కజాతివారును గాక, ఒక్కమతమువారు గాక లోకమే కుటుంబముగను సకలలోకైకనాయకుఁడైన భగవంతు నొక్కనినే నమ్మి యచంచల విశ్వాసముతో భజియించువారందఱును నొక్కమాటలోనివారుగను విశ్వసించి వర్తించుచుందురు. అట్టివారిని జూచి యల్పబుద్ధులు వీ రీమతమువా రనియు, వారామతమువా రనియు, తమలో తాము కయ్యములాడుకొందురే కాని యా మహాత్ము లవలంబించిన మతస్వభావమునుబట్టియే వారు సర్వసము లనియు, సత్య మేమతమం దున్నను వారి కాదరణీయమే యనియు, ఒక్కఁడైన భగవంతుని నమ్మనివారికి బహుమతములు కాని నమ్మినవారికనేకములు లేవనియు అట్టి మహాత్ములను ప్రత్యేకమతసంఘములకు బంధింపఁజూచుట తమయజ్ఞతయే కాని వేఱొక్కటి కా దనియు, తెలిసికోఁజాలకున్నారు. కబీరుదాసుని మరణా

నంతరము కబీరు మావాఁడు మావాఁడని హిందూమహమ్మదీయులు పోరాడుట చూడఁగా, కబీరుమతము సర్వసాధారణమతమైనట్టులు తోడనె గ్రహింపవచ్చును. అతఁడు చేసిన యుపదేశము లన్నియు నీ యంశమునే నిర్ధారణ చేయును. అతఁడు నమ్మిన రాముఁడు లోకాభిరాముఁడైన పరమాత్ముఁడే కాని వేఱొకఁడు కాఁడనియు, రామనామమును లోకసామాన్యమును జేసి, సకలమతములను సమ్మేళనము కావించి, మతవైషమ్యముల నడుగంటఁ జేయుటయే అతని యుద్దేశమైనట్లును అతని బోధన లన్నియు ప్రబలసాక్ష్యము నిచ్చుచున్నవి. అతని కీయద్భుతపరిజ్ఞాన మంతయు కేవలభక్తిప్రభావముచేతనే కలిగినది. అదియే మధ్యయుగమునందు మహాంధకారములోఁ బడియున్న యార్యావర్తమును తేజోవంతముగఁ జేసిన మహాపురుషాగ్రేసరులలో నాతని నొకనిగాఁ జేసినది. అట్టి జాతీయోద్ధారకుని మహోపదేశములను విస్మరించి నవభారతీయుఁ డెవ్వాఁడును ప్రోన్నతి నందఁజాలఁడని నిశ్శంకముగా వచియింపవచ్చును మన దురదృష్టవశముచేత, ఆమహనీయుని సచ్చారిత్రము మఱుఁగుపడియున్నను, మన యభ్యుదయమునకు ముఖ్యముగాఁ గావలసిన యాభక్తాగ్రేసరుని సదుపదేశములు ఏదోయొకవిధమున, గ్రంథస్థములై నిలిచియున్నందులకు మన మానందింపవలసియున్నది. ఆతనిచరిత్రనుగూర్చి తెలియని సంగతులను పెంచివ్రాయుటకంటె నమ్మహనీయుఁడు చేసిన యుపదేశములను గొన్నింటిని, అమ్మహాశయుఁడు తెలిపిన మతాభిప్రాయము లన్నియు సత్యములని సాక్ష్యమిచ్చునట్టి యాతని సుభాషితములను గొన్నింటిని, ఇందుఁ గ్రిందఁ బొందుపఱుచుచున్నాను.

ఉపదేశములు.

1. ఈలోకములో మనుష్యుఁడు జన్మాదినుండియు కేవలము పాపవర్తనుఁడై యున్నాఁడు. వానిదేహము “నాది, నాది” యని గ్రహింప సిద్ధముగువారు ఎంతమందియో యున్నారు. “వీఁడు మాబిడ్డడు, మాలాభము కొఱకై వీనిని మేము పెంచి పెద్దవానిని చేసినాము” అని తల్లిదండ్రులు చెప్పుదురు ఇఁక భార్య యన్ననో “ఇతఁడు నాపెనిమిటి” యని బెబ్బులివలె వానిని పట్టుకొనఁజూచును మఱి పిల్లలందఱును వానిమీఁద చూపునిలిపి మృత్యుదేవతవలె నోళ్లు తెఱచుకొని గతిమనకై ప్రతీక్షించుచుండురు. రాబందులు కాకులు చేరి వీఁ డెపుడు చచ్చునా యని కనిపెట్టుకొనియుండును. పందులు కుక్కలు శ్మశానవాటికకు తాము వెంబడించుటకై వీని శవమును ఎప్పుడు తీసికొనిపోవుదురా యని రాజమార్గముమీఁద వేచియుండును “వీనిని పూర్తిగా భస్మము చేయువఱకు నేను విడిచిపెట్టువాఁడను గాను” అని అగ్నిహోత్ర మనుచుండును. భూమి “వీనిని నాపాలు చేసికొందును” అని చెప్పుచుండును. వాయువు వానిని తీసికొనిపోవలె నని యాలోచించుచుండును. ఓజడమతులార! ఈదేహమును మీదేహముగా చూచుకొనుచున్నారు. ఎప్పటికప్పుడు మీగొంతుక పిసుకవలె నని వేనవేల శత్రువులు కనిపెట్టుకొని కూర్చుండుట మీకు తోఁచుట లేదా! ఐహికమోహము కన్నుగప్పుటచే నట్టిదేహమును మీది యని భావించుకొనుచున్నారు. అంతమంది చేరి మీదేహమున పాలుగొనవలె నని చూచుచుండుటచేత యావజ్జీవమును మీ కేదోయొక కష్టమే గాని సుఖ మనుమాట లేక యున్నది. ఓవెఱ్ఱులార! మీరు మేల్కొని యీ సంగతి తెలియనొల్లరు గాని యిది నాది యిది నాది యని మాత్రము విరామము లేక చెప్పుచుందురు.

2. రామనామ మను ధనమును పోగుచేయుము. ఆధన మెన్నడును నశించునది గాదు. అగ్ని దానిని దహింపలేదు. మారుతము దానిని కొట్టికొనిపోఁజాలదు. దొంగలు దానిని సమీపింపలేరు.

3. బంగారముతో కొనఁదలఁచినయెడల రాముఁడు దొరకఁడు. హృదయమూల్యమున కతఁడు చిక్కును.

4. భక్తి లేని జీవనము వ్యర్థము. భక్తసమాజమునఁ జేరి భగవంతుని పూజింపనిపక్షమున ఎవ్వానికిని సౌఖ్యము నిలువఁజాలదు.

5 కాలసర్పము హృదయములో నున్నది. అంతటియాత్మలయందును నది విషానలమును గ్రక్కినది. మనఃపూర్తిగా ఎవ్వరు నిక్కమైన యీశ్వరుని పూజింతురో వారు కొందఱే విముక్తి నందఁగలుగుదురు.

6. ఓసత్స్వామా! చిన్నబావియందు పల్లెవాఁడు అవలీలగా వలను పన్నుచున్నాఁడు. అట్టి బావినుండి తప్పించుకొనుట నీకు సాధ్యముకాదు. సాధుల సుమార్గము మాట దృష్టికిఁ దెచ్చికొని దాని నాశ్రయింపుము.

7. దురహంకారమునందు దుస్థితి యున్నది. పాపమునందు బాధ యున్నది. కాఠిన్యమునందు నిలుకడ యున్నది. అపరాధక్షమయందు దేవుఁడున్నాఁడు.

8. నాద నీడ ఒకటే సత్యము. ఒక్కప్రాణమే సమష్టియందు చలించుచున్నది. ఒకతల్లి గర్భమునుండియే యీవిశ్వ ముద్భవించుచున్నది. మనలో మన కడము కలిగించుచున్నది యిది యేటి జ్ఞానము?

9 ఒక్క దేశమునుండియే అందఱును వచ్చినారు. ఒక్క సుట్టముకడనే యందఱును దిగినారు. కాని యీమైహికమర్యాదయును లజ్జయు చేరి మనల నసంఖ్యాకములైన శాఖలుగనట్లుగా విడఁదీసినవి.

10. బ్రహ్మ యెక్కడివాఁ? ఆతని నెవఁడు పుట్టించినాఁడో వాఁ డెక్కడివాఁ? వేద మెక్కడిదా? అది యెవనివలన వచ్చెనో వాఁ డెక్కడివాఁ?

11. నీ వేద మాయమున్నావో యది శించిపోవుచున్నది. నీ వెవ్వని చూచుటలేదో వానినిగూర్చి నిరంతరము చింతనచేయుచుందువు.

12. చక్కగా వేసిన బొమ్మ గొప్పతెలుప కలదే సందేహము లేదు. బొమ్మను విడిచిపెట్టి చిత్రకారుని స్మరియింపుము.

13. ఓ మందబుద్ధీ! స్నానముచేయుటకు పుణ్యక్షేత్రము లనేకము లున్నవి. అర్చించుటకు విగ్రహములో వేనవే లున్నవి. కబీరు చెప్పిన దేమనఁగా " ఈ లాగు మోక్షము నెన్నటికిని ప్రాప్తింపదు. మోక్షము మన్న హరిసేవయందే యున్నది.

14. నీవు పడునట్టి చిక్కులన్నిటియందును నిన్నెవ్వఁడు భరియింపఁగలడో అట్టి నిక్కమైన ప్రభువు నొక్కనినే యనుసరింపుము. ఆప్రభువు దశరథుని యింట జన్మ మెత్తలేదు; లంకాపతిని హింసింపను లేదు. యశోద యాతనిని తన యొడిని డికొని లాలింపలేదు; ఆతఁడు దేవకీగర్భమున ప్రవేశింపను లేదు; ఆతఁడీలోక

మును విధ్వంసము చేయలేదు; బలిని మోసపుచ్చుటకై యతఁడు పాతాళమునకు దిగలేదు. అతఁడు వరాహరూపమును ధరింపలేదు; క్షత్రియులను పరిమార్పను లేదు. అతఁడు తన వ్రేలికొనమీఁద గోవర్ధనపర్వతము నెత్తలేదు; అటవీవాటికల యందు గోపికలతోఁ గూడియుండను లేదు. అతఁడు సాల్గ్రామము కాడు. మఱి యేతాయియు కాఁడు. అతఁడు మత్స్యము కాఁడు. కూర్మము కాఁడు. జలచరములైనవి యివెవ్వియును గాఁడు. అతఁడు ద్వారావతియందు నిర్యాణము చెందలేదు. జగన్నాథమునందాతని శవము ఖననము చేయఁబడను లేదు. కబీరు లోకమునకు ప్రకటించునది యేమనఁగా:—

“ఈ లాటి బోధనల నెవ్వఁడును అనుసరింపవలదు. ఎవ్వానిని స్థూలమును భౌతికమును నైన యుపాదానము కలవానినిఁగా భావించుచున్నారో, వాఁడు బహుసూక్ష్మధర్మములు కలవాఁడు.”

15. కాశిలో కాపురముచేయుచుండిన శివునితోఁ గూడ బ్రహ్మ అప్పుడే చచ్చిపోయినాఁడు. మధురానగరమునందు గొల్లవాఁడైన శ్రీకృష్ణుఁడు ప్రాణములు విడిచినాఁడు. దశావతారము లన్నియు నిరవలకే గతించినవి. మత్స్యేంద్రనాథుఁడు, గోరకనాథుఁడు, దత్తాత్రేయుఁడు, వ్యాసుఁడు ఈ యందఱిప్రాణములును పోయి చాలకాల మైనది. కబీరు ఉద్ఘోషించునది యేమనఁగా:—

“ఈ మనుష్యు లందఱును గూడ మృత్యువు వలలోఁ బడిపోయినారు.”

16. అన్నిసంగతులును మనస్సునకుఁ దెలియును; తెలిసియుండియు పాపము లొనర్చుచున్నది. చేతిలో దీప ముండియును నూతిలోఁ బడినప్పుడు, ఇంక నాదీప ముండిన ప్రయోజన మేమి?

17. మాతృగర్భమునందుండినప్పుడు జాతియు లేదు, వర్ణము లేదు; బ్రహ్మబీజమునుండి సృష్టి యంతయుఁ గలిగినది. ఓపండితుఁడా! బ్రాహ్మణు లెప్పుడు సృష్టింపఁబడినారో చెప్పు! “నేను బ్రాహ్మణుఁడను” అని చెప్పుకొన్నందువలన నీమతము నీజీవము నశించుచున్నవి సుమా! నీవు బ్రాహ్మణస్త్రీవలనఁ గలిగిన బ్రాహ్మణుఁడవే యైన పక్షమున నీవు వేఱుమార్గమున నేల పుట్టవైతివి?

ఎవ్వరివాఁడవు నీవు? బాపనివాఁడవా? నే నెవరివాఁడనను? శూద్రపువాఁడనా? నే నెవరిరక్తమువలన పుట్టితిని? నీ వెవరిక్షీరములవలన జనించితివి? కబీరు సూక్తి యేమనఁగా: బ్రహ్మమునుగూర్చి యెవ్వాఁడు చింతనసేయునో వాఁడే నాచేత బ్రాహ్మణుఁ డని పిలువఁబడుచున్నాఁడు. వర్ణమునుండి వర్ణము బయలు

జేరుచున్నది. అయినను విచారించి చూడఁగా నన్నియు నొక్కటే. ప్రాణమున కేమిభేద మున్నది? దీనినిగూర్చి చక్కఁగ యోజింపుము.

19. ఓ బ్రాహ్మణులార! అన్యులను అంటినంతమాత్రాన మీరు మైలపడితి మని తలంచుచున్నారు. మిమ్ముల నొక్కప్రశ్న మడుగనిండు! మీకంటె నీచుఁ డెవ్వఁ డున్నాడం? దురహంకారముచేత మీరు పెఱ్ఱిపోఁగుచున్నారు. గర్వాతి శయము ఎప్పడును సప్రయోజనమును గలిగింపఁజాలదు. గర్వభూయిష్ఠు లగువారిని అడంచువాఁ డని పేరుగన్న యాతఁడు మీపొగరు చూచి యెట్లు సహింప నేర్చును?

20. ఎవ్వనివాక్కునకు అర్థమేదియు లేదో, వానిహృదయములో సత్యము లేదు. అట్టివానితో పొందుసేయకు. వాఁడు నిన్ను బహిరంగముగా మార్గములో ముట్టువెట్టును సుమా!

21. నాదైన దేదియు నాలో లేదు; ఉన్నదంతయు నీదే. నీదైనదంతయు నీయధీనము చేసిన తరువాత, ఇంక నాది మిగులున దేమున్నది?

22. సప్తసముద్రముల నన్నిఁటిని నేను సిరాగాఁ జేసినను వృక్షసంతతు లన్నిటిని కలములుగా జేసినను భూతలమునంతను కాగితముగాఁ జేసినను హరిప్రభావమును వర్ణించి వ్రాయుట యసాధ్యమగును.

23. దైవభీతి యుదయించిన తోడనే యితర భీతి యస్తమించును. ఆభీతి యంతయు దైవభీతిలో మగ్నమై పోవును. దైవభీతి క్షీణింపఁజొచ్చెనా, నానాల భయము మనుష్యు నాశ్రయించును. మనుష్యునకు దైవభీతి నశించి నప్పుడు హృదయములో భయ ముద్భవించును; అదే వానికి మరణము.

24 లోకమంతయు దేనిపేరు విన్న భయావేశపరవశమగుచున్నదో, యట్టి మృత్యువు నామనస్సునకు ఆనందము; మృత్యువువలననే పరిపూర్ణానందమంతయు లభ్యమగుచున్నది.

25. నే నేదినమున మరణించితినో, యాదినమున మహానానంద ముప్పొంగివచ్చినది. ప్రభువు నాకు దర్శనమిచ్చెను. గోవిందుఁడు తన సెచ్చెలిని మన్నించుట సహజమే కదా!

26. గ్రంథపఠనమువలన మే లొదవునని నే నెఱుంగుదును; కాని గ్రంథపఠనము కంటె ధ్యానము శ్రేష్ఠతరమైనది. లోకులు నన్నెంత నిందించినను సీతారాముని యాశ్రయమును నే నెన్నఁడును విడుచువాఁడను కాను.

27. ఈ లోకముయొక్క స్థితినిఁ జూచి నేను కన్నీరు విడిచితిని. మఱి యెవ్వఁడును నాతోఁ గలసి దుఃఖించినవాఁడు లేఁడు. భగవన్నామ మెవ్వాఁడు గ్రహించునో, వాఁడే నాతోఁ గలసి యశ్రుకణములు రాల్ప సమర్థుఁడు.

28. అందఱును దేవునిగుఱించి ముచ్చటించువారె; కాని, నామనస్సులో నొకశంక పొడముచున్నది. వారు తమకుఁ దెలియని దేవుని ప్రార్థించుటకై యెట్లు గడంగుదురో తెలియరాకున్నది.

29. పండితులు వేదములు చదివి తప్పుదారిలోఁ బడియున్నారు. వారికి ప్రపంచజ్ఞాన మావంతయు లేదు. ఎంతయు నియమముతో క్రమము తప్పక, ఉదయమునను సాయంకాలమునను ఆ కుకర్మములను ఆచారములను వారు నడపుచుందురు. నాలుగు యుగములందును వారు గాయత్రిని పఠింపఁజేసినారు. ఆ లాగుచేయుటవలన పాపమునుండి యెవనికి ముక్తికలిగినదో వారిని చెప్పుమనుఁడు. ఇతరులను ముట్టుకొన్నందువలన తాము మైలపడితి మని వారు భావించుచున్నారు; తమ కంటె నీచు లెవ్వరున్నారో వారిని చెప్పుమనుఁడు.

30. తరువు తనకొఱకే ఫలములఁ బూనుటలేదు. ప్రవాహము తన నిమిత్తమే జలముల గ్రహించుటలేదు. ఇతరులకొఱకే సాధుజనుఁడు దేహధారి యగుచున్నాఁడు.

———

కబీరు.

కబీరు సాఖ్యములు.

చ॥ ఇరులు తొలంగ భానుఁ డుదయించిన, మానవదుష్టచింతనల్
హరియు మహాత్ము సద్గురు వివేకము వ్యాపనమైనతోనె; యీ
ధరణిని సద్గుణాగుణ విచారము మాయు దురాశచే; సహం
కరణముచే నశించు నధికంబుగ నీశ్వరభక్తి ప్రేల్మిడిన్. 1

గీ॥ సన్నయావగింజంత సూక్ష్మంబు గాదె
భక్తిమార్గంబునకుఁ గల్గు ద్వార మరయ!
గర్వమునఁ జేసి యేనుఁగు కరణిఁ దోఁచు
డెంద మక్కటా! నరుఁ డెట్టు లందుఁ జొచ్చు? 2

గీ॥ గురువునకు నెద్దైనను గొంక కీయ
సిద్ధుఁడై యుండవలయును శిష్యుఁ డెపుడు;
నెద్దియును శిష్యుఁ డీయ గ్రహింపఁజనదు
గురువు; గురుశిష్యధర్మంబు తెరువు లిట్టు. 3

గీ॥ అందినట్టి మానవదేహ మంపరాదు
మఱల నరునకు నెన్నండు మనసుదీఱ;
చెట్టుపండును చెట్టుతోఁ జేర్వరాదు
పుడమిఁ దొరఁగిన నొకమాఱు తొడిమ వీడ. 4

గీ॥ కాలమెల్లను వృథ యగుచుఁ గడచె నకట!
ప్రాజ్ఞుఁ డనురక్తి భజియింపఁడయ్యె హరిని;
నెంతయును వెన్కఁ గుందంగ నేమిఫలము
పక్షు లెల్లను గడతేర్పఁ బంట లెల్ల! 5

చ॥ వ్యసనము నందఁబోకు, మనయంబును జింతను దక్కియుండుము, మిం
పెసఁగ సృజించినట్టి విధియే సకలం బిడు నంచు నెంచుచున్;
పసులకుఁ గీటకంబులకుఁ బక్షులకుం గన నెందు నేని వె
క్కసముగఁ బెన్నిధుల్ గలవె? గాఢతరంబుగఁ గల్మి యున్నదే? 6

చ॥ కమఠము గ్రుడ్డులం బొదివి కాచుఁగదా పక్షులంబుగా నురో
జములును లేకయే, పెనుచు సాధనకోటి తెలం గతింగి; యా
క్రమమున జీవరాసుల జగంబుల సృష్టి యొనర్చినట్టి దై
వమె సమకూర్చుఁ బ్రేమమున వస్తువులన్, దగు జీవికాదులన్. 7

గీ॥ సుత్తి దొంగిలించి సూది దానముచేసి, తేరు వచ్చునంచుఁ జూడు నెక్కి-
చూచువానిపగిది, సుంత సత్క్రియ చేసి, యజ్ఞుఁ డుబ్బు మోక్ష మబ్బునంచు. 8

గీ॥ స్వములై కడు పెందలు నడచువారొ, వారలందఱు పొత్తుంబుఁ బడయువారు.
అగ్రజన్ముల మంచు గర్వోగ్రు లగుచుఁ, ద్రుళ్లువార లధోగతిఁ ద్రెళ్లువారు. 9

గీ॥ అధికులకె తోడుపడ నెంతు రంద ఱిచటఁ; గాని యల్పుల కెవ్వారుగానరారు;
దయమునకు గాడ్పు తోడ్పడి రవులఁజేయు, నదియె దీపంబు నింతలో నార్పివేయు.

గీ॥ పూలతోఁటలోనికిఁ దోఁటమాలి యరుగ, బల్కెఁ బూమొగ్గ లీరీతి వానిఁజూచి:
'పుణుకఁబడియెదు వికసించు పూలు నేఁడు; ఎల్లిమా వంతు వచ్చెడు నిది నిజంబు.'

గీ॥ జాతి యేది యనుచు సాధు నడుగ నేల? దాని జ్ఞాన మనియు తెలయఁ గాని;
కత్తివిలువఁగూర్చి కడఁగి యోజించుచో, నొఱను గూర్చి పెద్దయూహ యేల? 12

గీ॥ ఉర్విఁ బెద్దదై, యేమి ప్రయోజనంబు? తాళవృక్షంబు మిగులఁ బెద్దదియ కాదె?
దాని నీడను గూర్చుండఁ దలఁచు నెవఁడు? దానిఫలములు మన కందరాని వెకదె?

గీ॥ బాధపెట్టకు మెవని దుర్బలుఁ డటంచు, నతని హాహారవంబుల హానశక్తి
కలదు సుమి; ప్రాణమే లేని కొలిమితిత్తి, చేతఁ గత్తియు రూపుఁజేయఁబడదె?

గీ॥ జల్లెడను జూడు! పొల్లును సంగ్రహించి, సారమగు గింజలను గ్రింద జాఱవిడుచు;
నవ్విధంబున నే యజ్ఞుఁడైన నరుఁడు, సారమును ద్రోసి, పూను నసార మిలను. 15

గీ॥ తమకొఱకె పూనవంబువుల్ ధరణీరుహములు, స్వాదుఫలముల్ ధరింపవు పాదపములు
సాధుజనములు దైహికజన్మమిట్టు, లంచితపరోపకృతిని గావించుకొఱకె. 16

11014

685/1920

శ్రీర్భూయాత్.

శ్రీభుజంగరాయ తారావళి.

P.No 108
S/No 48

ఇది
ప్రస్తుతము పెరవలి బీ. బీ. యస్. స్కూలు
తెలుఁగు పండితుఁడయిన
అష్టావధాని అబ్బరాజు హనుమంతరాయశర్మచేత
రచియింపఁబడి ప్రకటింపఁబడియె.

బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు
బి. కే. స్వామిచేత ముద్రింపఁబడియె.
1920.

OFFICE OF ... 2-SEP 1920
S.No. 773
Acc No. 9297